సాక్షి
సిద్దిపేట
గురువారం, 2, నవంబర్, 2023



పొత్తు.. వీడని చిక్కు

కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తులు ఖరారు కాకపోవడంతో హుస్నాబాద్‌లో గందరగోళం నెలకొంది. వివరాలు 10లో ▸



ఆశీర్వదించండి..

దుబ్బాక ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలిచి ఈ గడ్డ రుణం తీర్చుకుంటానని బీజేపీ అభ్యర్థి రఘునందన్ అన్నారు. వివరాలు 10లో ▸



వైభవంగా బోనాలు

జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్‌లో పెద్దమ్మ తల్లికి బోనాలు వైభవంగా నిర్వహించారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి



ఏఎంసీ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బెజ్జంకి ఏఎంసీ మార్కెట్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కొనుగోలు కేంద్రాలలో అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్, డీఎస్‌ఓ తనుజ, అదనపు డీఆర్‌డీఓ రవీందర్, డీపీఎం కరుణాకర్, వాసుదేవ్, ఏపీఎం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

144 సెక్షన్ అమలు

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నామినేషన్ వేసే కార్యాలయాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నామినేషన్ ప్రక్రియ ఈనెల 3నుంచి 10వ తేదీ వరకు ఉన్నట్లు తెలిపారు. సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం, గజ్వేల్ ఐటీసీ భవనం, దుబ్బాక ఐటీసీ భవనం, హుస్నాబాద్ ఐటీసీ భవనం వద్ద ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

అధ్యాపకులకు డాక్టరేట్



సన్మానం పొందిన అధ్యాపకులు

వర్గల్(గజ్వేల్): మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాధారాణి (కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్), డాక్టర్ సోనివీణ(బోటని డిపార్ట్‌మెంట్)లు పీహెచ్‌డీ సాధించారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో వారికి పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వర్గల్ గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు అధ్యక్షతన అభినందన సభ నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు, ఇన్‌చార్జి ఏటీపీ ఉమా మహేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న యూత్‌కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్: 'కాళేశ్వరం ఏటీఎం మిషన్' పేరిట బుధవారం పట్టణంలో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. కాళేశ్వరం ఏటీఎం పేరుతో మిషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా డబ్బులు ఎలా దోచుకున్నారో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీనవేని రాకేశ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో సీఎం కేసీఆర్ భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దశాబ్దంలో అతి పెద్ద స్కాం కాళేశ్వరమని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిదురాల సురేష్, కార్యదర్శి బోయిని సురేష్, నాయకులు పాల్గొన్నారు.

చిరుత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు



న్యాల్‌కల్(జహీరాబాద్): ముంగి గ్రామ శివారులో సంచరిస్తున్న చిరుతను పట్టుకునేందుకు జహీరాబాద్ ఫారెస్టు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. మంగళవారం రాత్రి పులి సంచరించడం చూసి పలువురు యువకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం అధికారులు చిరుత సంచరించిన ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వెల్లువెత్తిన చైతన్యం



- ఓటు హక్కు కోసం పోటెత్తిన దరఖాస్తులు
- జిల్లా వ్యాప్తంగా 22,095 అప్లికేషన్లు
- 8లోగా క్షేత్రస్థాయిలో పరిశీలన
- 11న తుది జాబితా విడుదల

సాక్షి, సిద్దిపేట: ఓటు హక్కు కోసం అనూహ్య స్పందన లభించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపట్టింది. అక్టోబర్ 5వ నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. నూతనంగా ఓటు హక్కు కోసం 22,095 మంది దరఖాస్తు చేశారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఈ నెల 11న తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఈ జాబితాలో పేర్లు ఉన్న వారందరూ ఈసారి ఎన్నికల నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

క్షేత్ర స్థాయిలో..

ఫారం-6 ద్వారా ఓటు హక్కు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 8వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల తహసీల్దార్ కార్యాలయాలకు అందిస్తారు. అర్హత ఉన్న వారి వివరాలను ఎన్నికల సంఘం సంబంధించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనుంది. ఈ నెల 11న తుది జాబితాల వెల్లడిస్తారు.

పెరగనున్న ఓట్ల సంఖ్య

నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత ఉన్న వారికి ఓటు హక్కును కల్పిస్తారు. ఈ నెల 30న ఎన్నికలు ఉండటంతో నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. 18 ఏళ్లు ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునే విధంగా బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు సైతం కృషి చేశారు. నూతనంగా పలువురికి ఓటు హక్కును కల్పిస్తుండటంతో ఆయా నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరగనుంది. నాలుగు నియోజక వర్గాల్లో ప్రస్తుతం 9,25,868 మంది ఓటర్లు ఉన్నారు.

నియోజకవర్గం	వచ్చిన దరఖాస్తులు
హుస్నాబాద్	5,041
సిద్దిపేట	5,244
దుబ్బాక	3,699
గజ్వేల్	8,111
మొత్తం	22,095

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు
సిద్దిపేట	2,28,635
హుస్నాబాద్	2,36,798
గజ్వేల్	2,65,710
దుబ్బాక	1,94,725
మొత్తం	9,25,868

అక్కడ స్వతంత్రులదే హవా

- సంగారెడ్డి, సిద్దిపేట, నారాయణఖేడ్‌లలో ఇండిపెండెంట్ల విజయభేరి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 12 మంది గెలుపు
- సంగారెడ్డిలో రెండుసార్లు నర్సింహారెడ్డి విజయం



మదన్‌మోహన్



కరణం రామచంద్రరావు



సైదయ్య

సాక్షి, సిద్దిపేట: దేశం, రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలదే హవా కొనసాగినా.. కొన్ని మార్లు ఇండిపెండెంట్లు కూడా సత్తాచాటారు. ప్రజలు వారికే పట్టం కట్టిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అందుకు ఉమ్మడి మెదక్ జిల్లానే ఉదాహరణ. పలు మార్లు ఇక్కడ స్వతంత్రుల వైపు ఓటర్లు మొగ్గుచూపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 8 నియోజకవర్గాల్లో స్వతంత్రులు విజయభేరి మోగించారు.13 సార్లు ఇండిపెండెంట్లు తమ సత్తాచాటారు.

సిద్దిపేటలో ఇద్దరు..

సిద్దిపేట నియోజకవర్గంలో రెండు సార్లు ఇండిపెండెంట్లు గెలుపొందారు. 1962లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పీవీ రాజేశ్వరరావుపై ఇండిపెండెంట్‌గా సోమేశ్వరరావు విజయం సాధించారు. 1970లో జరిగిన ఉప ఎన్నికల్లో మదన్‌మోహన్ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. అప్పుడు 73,208 ఓట్లు పోలవగా మదన్ మోహన్ 51,853 ఓట్లు సాధించారు. సమీప కాంగ్రెస్ అభ్యర్థి పీవీ రాజేశ్వరరావుకు 11,562 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం.

రెండు సార్లు నర్సింహారెడ్డి..

సంగారెడ్డి నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరగగా నాలుగు సార్లు ప్రజలు ఇండిపెండెంట్లకు పట్టం కట్టారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఇండిపెండెంట్‌గా నర్సింహారెడ్డి గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రారెడ్డిపై నర్సింహారెడ్డి 2,068 ఓట్ల మెజార్టీతో, 1978లో జనతా పార్టీ నుంచి బరిలో దిగిన రామచంద్రారెడ్డిపై 18,210 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థి జీఆర్‌రెడ్డిపై కృష్ణమాచారి 3,143 ఓట్ల మెజార్టీతో, 1983లో కాంగ్రెస్ అభ్యర్థి వీరారెడ్డిపై ఇండిపెండెంట్‌గా బరిలో దిగిన పి.రామచంద్రారెడ్డి 5,669 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

నారాయణఖేడ్‌లో..

నారయణఖేడ్ నియోజకవర్గంలో ఇద్దరు ఇండిపెండెంట్‌లు విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్ పార్టీ నుంచి అప్పారావు, ఇండిపెండెంట్‌గా ఆర్.దేశ్‌పాండే బరిలో దిగారు. 2,209 ఓట్ల మెజార్టీతో దేశ్‌పాండే ఎమ్మెల్యేగా గెలుపొందారు.1972లో కాంగ్రెస్ అభ్యర్థి శివరావు షేట్కర్‌పై ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఎం.వెంకట్ రెడ్డి 10,657 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

మెదక్, అందోల్, గజ్వేల్‌లో ఒక్కొక్కసారి

మెదక్, అందోల్, గజ్వేల్, పాత నియోజకవర్గాలైన రామాయంపేట, దొమ్మాట, రాజగోపాల్‌పేటలో ఒక్కొక్కసారి స్వతంత్రులకు పట్టం కట్టారు. 1972లో మెదక్ నుంచి కరణం రామచంద్రరావు, 1962లో గజ్వేల్ నుంచి సైదయ్య, 1972లో రామాయంపేట నుంచి కొండల్‌రెడ్డి, 1967లో దొమ్మాట నుంచి మైదా భీమ్‌రెడ్డి, రాజగోపాల్‌పేట నుంచి 1952లో కేవీ నారాయణరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలుపొందారు.

ఎన్నికల విధులపై అవగాహన తప్పనిసరి

- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- గజ్వేల్‌లో ఎన్నికల సిబ్బంది శిక్షణ శిబిరం



ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

గజ్వేల్: ఎన్నికల విధుల నిర్వహణలో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ హెచ్చరించారు. బుధవారం గజ్వేల్‌లోని ఎడ్యుకేషన్ హబ్‌లో ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో అందజేసిన హ్యాండ్ బుక్, ఈవీఎం బ్రోచర్ క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధులను నిర్వహించాలని చెప్పారు. ప్రతి ఎన్నికల్లో కొత్త, కొత్త మార్గదర్శకాలు వస్తున్నాయని, వాటిపై పూర్తిస్థాయి అవగాహన పొందాలన్నారు. అదేవిధంగా ఈవీఎం మిషన్లు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ మిషన్‌లో పేపర్ అమర్చే విధానం తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ సందర్భంలో చిన్న సమస్య తలెత్తినా, పై అధికారులకు వెంటనే సమాచారమిస్తే... వాటిని పరిష్కరించే అవకాశముంటుందన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ చెక్ పోస్టును బుధవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్పెషల్ ఆఫీసర్, పోలీస్ అధికారులు మూడు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వర్తిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. డబ్బులు, మద్యం అక్రమంగా రవాణా జరగకుండా చూడాలన్నారు. చెక్‌పోస్టు వద్ద కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఏజెన్సీ ప్రతినిధులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారని చెక్‌పోస్టు స్పెషల్ ఆఫీసర్ గులామ్ మోయినుద్దీన్ సూచించారు.

ట్రిక్కులెన్ని చేసినా.. హ్యాట్రిక్ తప్పదు

- మంత్రి హరీశ్ రావు

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఎన్ని ట్రిక్కులు చేసినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ తప్పదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికలు మన భవిష్యత్‌కు ముఖ్యమైనవని, అందరూ కలసి పనిచేయాలన్నారు. ప్రతిపక్షాలు ఎన్నో జిమ్మిక్కులు చేస్తాయని ఆగం కావొద్దన్నారు. హైదరాబాద్ నుంచి బెంజి కారుల్లో వచ్చే వారు మెదక్ ప్రజల ఆత్మగౌరవం గురించి మాట్లాడుతారా? అంటూ ప్రశ్నించారు. రైతుబంధు భిక్షం వేస్తున్నామన్న రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. టీఆర్‌ఎస్‌ను గెలిపించాలని, మోసపోతే గోస పడతామన్నారు. పద్మాదేవేందర్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అభివృద్ధిలో భాగస్వాములవుదాం

- ఇస్రో సీనియర్ సైంటిస్ట్ స్మృతిగుప్తా



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న ఇస్రో సీనియర్ సైంటిస్ట్ స్మృతిగుప్తా

మద్దూరు(హుస్నాబాద్): పల్లె అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉండాలని, గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా ఉంచేలా కృషి చేయాలని ఇస్రో సీనియర్ సైంటిస్ట్ స్మృతిగుప్తా అన్నారు. బుధవారం దూల్మిట్ట మండల కేంద్రంలో ఎన్‌ఆర్‌ఐఈజీఎస్ ఆధ్వర్యంలో పదేళ్లుగా కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పల్లెప్రకృతి వనం, నర్సరీ, డంప్‌యార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ కార్మికులతో మాట్లాడారు. పనులు ఏ విధంగా సాగుతున్నాయి? కూలీ డబ్బులు నేరుగా అకౌంట్‌లో జమ అవుతున్నాయా అంటూ కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీలో చేసే ప్రతి పని వివరాలు ప్రతి రోజు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పని నాణ్యతతో చేయాలన్నారు. గురువారం మరిన్ని పనులను పరిశీలించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐఈజీఎస్ సభ్యులు అజయ్ గుహ, ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు లేదు

డీఎస్పీ అభ్యర్థి సదన్ మహరాజన్



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సదన్ మహరాజన్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయకుండానే బీఆర్‌ఎస్ ఓట్లు అడగడం ఎమిటనీ ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థి సదన్ మహరాజన్ విమర్శించారు. అక్కన్నపేట మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా లక్ష ఎకరాలకు సాగునీరు అందించే గౌరవెల్లి ప్రాజెక్టు అని గొప్పలు చెప్పుకునే బీఆర్‌ఎస్ ఇంతవరకు ఎందుకు పూర్తిచేయలేకపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు సరైన పద్ధతిలో పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జీ తాళ్ల నరేష్, ప్రోగ్రామ్ ఇంచార్జ్ సతీష్, నాయకులు బత్తుల నరేష్, శంకర్ పాల్గొన్నారు.

నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి 'పోతగల్ల'

- ఆయన మృతి తీరనిలోటు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



పోతగల్ల లింగం ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న మంద కృష్ణ మాదిగ తదితరులు

వర్గల్(గజ్వేల్): మాదిగ దండోరా ఉద్యమంలో సీనియర్ నాయకుడు పోతగల్ల లింగం మాదిగ ఆకస్మిక మృతి అత్యంత బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన వర్గల్ మండలం చౌదరిపల్లి సందర్శించి లింగం కుటుంబీకులను పరామర్శించారు. చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగం మృతి ఉద్యమానికి తీరని లోటని, సుమారు రెండు దశాబ్దాలుగా ఉద్యమంలో నీతి, నిజాయితీ, విలువలతో జాతి కోసం పని చేస్తూ ఎనలేని సేవ చేసిన లింగం మృతి ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు మైస రాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు చేబర్తి యాదగిరి, బెల్లీ శ్యామల, నాగభూషణ, సల్ల శ్రీనివాస్, డాకని కుమార్, పోచయ్య, రమేష్, గంగధర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన శత్రువు బీఆర్‌ఎస్సే



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

- చేయిచేయి కలుపుదాం
- మార్పు సాధిద్దాం
- కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ప్రగతి శీల భావాలు కలిగిన హుస్నాబాద్ ప్రాంతంలో మార్పు రావాలని ప్రజలు చేయి చేయి కలిపి ప్రధాన శత్రువైన బీఆర్‌ఎస్‌ను ఓడించాలని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు బుధవారం పొన్నం ప్రభాకర్, అసెంబ్లీ పరిశీలకుడు గోపినాథ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలో చేరిన నాయకులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా పలు అంశాల పై ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు అవగాహన లేక అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజలు మార్పుకోరుకుంటున్నారని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. చేరిన వారిలో అక్కు శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

యోగా రాష్ట్ర చాంపియన్ మెదక్



ఓవరాల్ చాంపియన్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు

సిద్దిపేటజోన్: ఆధ్యాత్మికత, మానసిక, శారీరక శక్తులను వెలికితీయడానికి యోగ ఒక అద్భుతమైన సాధనమని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీటీసీ భవన్‌లో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి యోగా ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా లక్ష్యాలను సాధించే అవకాశం ఉందన్నారు. మూడు రోజులు జరిగిన ఈ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు 63 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ సొంతం చేసుకుంది. 34 పాయింట్లు సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెండో స్థానం, 23 పాయింట్లతో ఉమ్మడి వరంగల్ జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. ఈ నెల 25 నుంచి మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్ 17 యోగా జాతీయ స్థాయి పోటీలకు, అదే విధంగా డిసెంబర్‌లో త్రిపురలో జరగనున్న అండర్ 14 జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర యోగా జట్టు సభ్యులను సిద్దిపేటలో బుధవారం పరిశీలకులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్డీఏ పీడీ జయదేవ్, జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి నాగేందర్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు సతీశ్, వెంకటస్వామి, లక్ష్మణ్, శ్రీనివాసులు, ఉప్పలయ్య, అశోక్, రాజ్ కుమార్, సుజాత, లత, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిత్రాలు..

గొర్రెపిల్ల.. చేయి జారకుండా



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివనూర్, కాశతండా, సరోజినీనగర్, సంకాపూర్ గ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జప్తి శివనూర్ గ్రామస్తులు రోహిత్‌కు గొర్రెలను బహూకరించారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మటన్ కొట్టు.. ఓటు పట్టు



మటన్ కొడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కొండపోచమ్మ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు దుకాణాలు తిరుగుతూ ప్రచారం చేశారు. అక్కడ బీడీలు చుడుతా ఓటు కారుకే వేయాలి.. అన్న మటన్ ముక్క కొడుతా సార్ కేసీఆర్‌ను మరువద్దు అంటూ వినూత్న పద్ధతిలో ప్రచారం చేశారు.

మనసంతా ప్రచారమే..



నేరడిగుంట సంతలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట చౌరస్తా సంతలో ఎన్నికల ప్రచారం చేపట్టి సంక్షేమ పథకాలు, ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించి ఓటును అభ్యర్థించారు బీఆర్‌ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు.

క్లుప్తంగా

రసమయి కారు తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి వస్తున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కారును బుధవారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా తనిఖీలు చేస్తున్న సమయంలో ఎమ్మెల్యే కారు రావడంతో తనిఖీ చేశామన్నారు.

రాత.. 'కోడ్' మూత



రాతలను చెరిపివేసిన సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

చేర్యాల(సిద్దిపేట): ఇక్కడ కోడ్ వర్తించదా..? పేరుతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన శీర్షికపై స్థానిక అధికారులు స్పందించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో గోడలపై రాసిన రాతలను చెరిపివేయాల్సి ఉంటుంది. కానీ, అలాగే వదిలేశారు. ఈ రాతలను గుర్తిస్తూ సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు బుధవారం గోడలపై రాతలను చెరిపివేశారు.

చాడను కలిసిన పొన్నం



చాడ వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చినందున చాడ వెంకట్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు కోరినట్లు తెలిపారు. చాడ వెంకట్ రెడ్డి ఈ ప్రాంత సమస్యలపై సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉన్నారని అన్నారు. పార్టీకి మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిధులన్నీ సిద్దిపేట, గజ్వేల్‌కేనా?



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కలిసి నిధులు మొత్తం సిద్దిపేట, గజ్వేల్‌కే తీసుకెళ్లారని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని మల్లేశంపల్లి, కొనాపూర్, మహ్మద్‌షాపూర్, ఇందుప్రియల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు గొల్లపల్లి కనకయ్య, బండారు లాలు, తదితరులు పాల్గొన్నారు.

పొత్తు.. వీడని చిక్కు

- కాంగ్రెస్ త్వరగా తేల్చాలంటున్న సీపీఐ!
- ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానంటున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి
- ఇరకాటంలో పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్
- ప్రచారంలో బీఆర్‌ఎస్ దూకుడు
- టికెట్ ఎదురుచూపుల్లోనే బీజేపీ ఆశావాహులు
- రసవత్తరంగా హుస్నాబాద్ రాజకీయం





హుస్నాబాద్: ఎన్నికల నామినేషన్లకు గడువు ముంచుకొస్తుండటంతో బీఆర్‌ఎస్ తప్ప అన్ని పార్టీలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను ప్రకటించినప్పటికీ, కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తులు, సీట్ల కేటాయింపులపై క్లారిటీ ఇవ్వకపోవడంతో కార్యకర్తలు మండిపడుతున్నారు. కాలయాపన చేస్తే హుస్నాబాద్‌లో ఒంటరిగా పోటీ చేస్తామని హెచ్చరించడంతో కాంగ్రెస్ డైలామాలో పడింది. మరో వైపు కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పక్కాగా ఇండిపెండెంట్‌గా బరిలో ఉంటానని రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తులో భాగంగా సీపీఐ 5 స్థానాలు, సీపీఎం 5 స్థానాలు కేటాయించాలని వామపక్ష పార్టీలు కోరాయి. సీపీఐ కోరుకున్న 5 స్థానాల్లో హుస్నాబాద్ కూడా ఉంది. తదనంతర పరిణామాలతో సీపీఐకి రెండు, సీపీఎంకు రెండు సీట్లతో పాటు ఎమ్మెల్సీ స్థానాలను ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా సీపీఐ పార్టీకి కొత్తగూడెం, చెన్నూరు సీట్లు ఇస్తామని కాంగ్రెస్ ఒప్పుకున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఇచ్చే సీట్లలో కూడా కాంగ్రెస్ నాన్చుడు ధోరణిని అవలంబిస్తూ ఎలాంటి క్లారిటీ ఇవ్వడం లేదు. నామినేషన్ల గడువు ముంచుకొస్తుండడంతో తాము ఎప్పుడు ప్రచారం చేసుకోవాలని, ప్రజల్లోకి వెళ్లేదెప్పుడని మండిపడుతున్నారు.

ప్రచారంలో బీఆర్‌ఎస్ ముందంజ



నెల రోజుల క్రితమే హుస్నాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పేరు ప్రకటించారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సతీష్ కుమార్‌కు బీఫాం అందుకున్నారు. అప్పటి నుంచి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరో వైపు బీజేపీ నుంచి అభ్యర్థిని ప్రకటించలేదు. టికెట్ కోసం బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపు రెడ్డి సురేందర్ రెడ్డి, కోమటి రెడ్డి రాంగోపాల్ రెడ్డి, మంజుల రెడ్డి పోటీ పడుతున్నారు. ఏది ఏమైనా హుస్నాబాద్ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీతో రాజకీయం రసవత్తరంగా మారింది.

ఇండిపెండెంట్‌గా మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి!



పొన్నం ప్రభాకర్



అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

హుస్నాబాద్ కాంగ్రెస్ టికెట్ పొన్నంకు ఖరారు కావడంతో టికెట్ ఆశించి భంగపడిన ప్రవీణ్‌రెడ్డి ప్రభాకర్‌కు ఎట్టి పరిస్థితిలో మద్దతు పలికేదిలేదని చెప్పారు. పార్టీ అధిష్టానం ప్రవీణ్‌రెడ్డిని పిలిచి చర్చించినా ఫలితం లేదు. ఇప్పటికే ప్రవీణ్‌రెడ్డి తన అనచరులతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాల మేరకు ఎన్నికల బరిలో నిలిచేందుకే మొగ్గుచూపుతున్నట్లు ఆయన వర్గీయులు స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ లేదా ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

ఒంటరిగానే బరిలోకి సీపీఐ?



చాడ వెంకట్ రెడ్డి

గత ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మహాకూటమి సందర్భంగా సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ ఇదే ధోరణి అవలంభించింది. హుస్నాబాద్ సీటును చివరి క్షణంలో సీపీఐకి కేటాయించడంతో అధికార పార్టీ అభ్యర్థి కంటే ప్రచారంలో సీపీఐ వెనుకబడిందని కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడూ అలానే చేస్తుండడంతో.. త్వరగా తేల్చాలని సీపీఐ కాంగ్రెస్‌కు డెడ్‌లైన్ విధించింది. సీట్ల విషయంలో కాంగ్రెస్ క్లారిటీ ఇవ్వకుంటే, హుస్నాబాద్‌లో సీపీఐ ఒంటరిగా బరిలో నిలుస్తోందని హెచ్చరించారు. హుస్నాబాద్‌లో సీపీఐ పొత్తుతో కొన్ని ఓట్లను కాంగ్రెస్ వైపు తిప్పుకోవచ్చని అంచనా వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు కార్యకర్తలు డెడ్‌లైన్‌తో షాక్ ఇచ్చారు. సీపీఐ నాయకులు సైతం గ్రామాల్లో పర్యటిస్తూ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.



గాంధీ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న నర్సాపూర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు (ఫైల్)



పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నర్సాపూర్ బీజేపీ నాయకులు (ఫైల్)

ఆరని అసమ్మతి సెగ

- బీజేపీ, కాంగ్రెస్‌లో నిరసనల హోరు
- చర్చలు, బుజ్జగింపుల్లో నేతలు
- బీఆర్‌ఎస్‌లో పుంజుకున్న ఉత్సాహం

నర్సాపూర్: నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ వారు తమ అనుచరులు, కార్యకర్తలతో కలిసి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలిపేది లేదంటూ తీర్మాణాలు చేస్తున్నారు. మరో పక్క బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకెళ్తుంది. అలాగే, ఇక్కడి నుంచి బీఎస్పీ పోటీ చేస్తామని చెప్పినా ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.

స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో..

కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నుంచి తమ అభ్యర్థిగా ఆవుల రాజిరెడ్డిని ప్రకటించింది. ఇదే తరుణంలో టికెట్ ఆశించిన పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, పీసీసీ డెలిగేట్లు ఆంజనేయులు గౌడ్, రవీందర్‌రెడ్డి ఆవుల రాజిరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఆవుల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి కోవర్టుగా అభివర్ణిస్తూ ఆయన్ను వెంటనే మార్చాలని ముగ్గురితోపాటు పలువురు నాయకులు బాహాటంగా డిమాండ్ చేశారు. గత 29న హైదరాబాద్‌కు వెళ్లి మరీ గాంధీ భవన్ ఎదుట ధర్నా చేసి, ఆవుల రాజిరెడ్డిని మార్చి కాంగ్రెస్ పార్టీని కాపాడాలని నినాదాలు చేశారు. లేని పక్షంలో టికెట్ కోసం దరఖాస్తు చేసిన తమలో ఒకరం స్వతంత్ర అభ్యర్థిగా నర్సాపూర్ ఎన్నికల బరిలో ఉంటామని ఆంజనేయులుగౌడ్, రవీందర్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్‌లోని అసమ్మతి నాయకులకు పార్టీ అధిష్టానం నచ్చజెప్పి బుజ్జగింపు చేస్తుందా.. లేక తమ అసమ్మతిని కొనసాగిస్తూనే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతారా.. అనేది చూడాలి.

అభ్యర్థిని మార్చాలంటూ నిరసన..

బీజేపీ నర్సాపూర్ అభ్యర్థిగా మురళీయాదవ్‌ను ప్రకటించగా టికెట్ కోసం దరఖాస్తు చేసిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి, మరో ఇద్దరు నాయకులు రఘువీరారెడ్డి, మల్లేశ్‌గౌడ్ ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన మురళీయాదవ్‌కు టికెట్ ఎలా ఇస్తారని, వెంటనే అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో టికెట్ కోసం దరఖాస్తు చేసిన వారిలో ఒకరం పోటీలో ఉంటామని హెచ్చరించారు. నియోజకవర్గంలో అభ్యర్థిపై వ్యతిరేకత రావడంతో పార్టీ ఇన్‌చార్జి కర్ణాటకకు చెందిన ఈశ్వర్‌సింగ్ ఠాగూర్ నర్సాపూర్‌లోని పలువురు పార్టీ నాయకులతో చర్చించారు. అయినా, గత నెల 30న హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, వెంకటేశ్వర్లుతో చర్చించారు. అభ్యర్థిని మార్చడంపై పార్టీ నాయకులతో చర్చించేందుకు ఏర్పాట్లు చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ అసమ్మతిని పార్టీ అధిష్టానం ఎలా తీరుస్తుందో వేచి చూడాలి.

శంఖారావంతో బీఆర్‌ఎస్‌లో ఉత్సాహం..

నర్సాపూర్ బీఆర్‌ఎస్ టికెట్‌ను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతారెడ్డి ఆశించగా సునీతారెడ్డికి టికెట్ ఇచ్చి మదన్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని అధిష్టానం నచ్చజెప్పడంతో పార్టీ కార్యక్రమాల్లో ఇద్దరూ కలిసి పని చేస్తున్నారు. శంఖారావం సభకు నాయకులు, కార్యకర్తలను తీసుకురావడంలో ఇద్దరూ ప్రణాళికతో పని చేశారు. మదన్‌రెడ్డికి టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకురాలు సుహాసిని రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శేషాసాయిరెడ్డి, వెల్దుర్తి ఎంపీపీ అధ్యక్షురాలు స్వరూపలతోపాటు నరేందర్ రెడ్డి, క్రిష్ణగౌడ్ తదితరులు పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మరి కొంతమంది వెళ్లినా బీఆర్‌ఎస్‌లో ఉన్న నాయకులు మాత్రం ఉత్సాహంగా పని చేస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి తమ ఎన్నికల ప్రచారాన్ని మాసాయిపేట మండలంలోని రామంతాపూర్‌లో పూజలు చేసి ప్రారంభించారు.

పూజలు చేసి.. ప్రచారాన్ని ప్రారంభించి



ప్రచారం ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ తల్లికి పూజలు చేసి.. బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం పార్టీ నాయకులు ప్రారంభించారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జంగంరెడ్డిపల్లి, తిగుల్‌నర్సాపూర్, కొండపోచమ్మ వద్ద ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ బాలేశం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేశ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్, మండలాధ్యక్షురాలు కావ్య, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, సర్పంచ్‌లు రజిత, కుమార్, యాదవరెడ్డి, చంద్రశేఖర్, సత్యం, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, విజయ్, జశ్వంత్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

దేశం గర్వించేలా తెలంగాణ అభివృద్ధి



మాట్లాడుతున్న చింతా ప్రభాకర్

కొండాపూర్ (సంగారెడ్డి): పదేళ్లలో దేశం గర్వించేలా రాష్ట్రానికి అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. మండల పరిధి లోని మల్కాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. 30వ తేదీ న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకి ఓటు వేసి ఎమ్మెల్యే గా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌ఎం ఎస్‌ఐడీసీ ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.5.40 లక్షలు సీజ్

చేర్యాల(సిద్దిపేట): ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు రెండు ప్రాంతాల్లో రూ.5,40, 800 సీజ్ చేశారు. చేర్యాల పట్టణ కేంద్రంలోని ఓ వ్యాపారి ఇంట్లో రూ.3లక్షల నగదును ఎన్నికల స్క్వాడ్ అధికారి స్వాధీనం చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. కేపీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న వంగపల్లి వెంకటేశం ఇంట్లో అధిక మొత్తంలో నగదు నిల్వ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ.3లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రాజేందర్, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: వాహన తనిఖీల్లో ఎలాంటి రసీదులు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేశారు. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామానికి చెందిన మల్లేశం వద్ద రూ.1,10,800, బాలయ్య వద్ద రూ.1,30,000 నగదు లభించగా ఎలాంటి రసీదులు లేకపోవడంతో వాటిని సీజ్ చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి అందజేసినట్లు సీఐ తెలిపారు.

'ఆశీర్వదించండి.. ఈగడ్డ రుణం తీర్చుకుంటా'



ప్రచారం చేస్తున్న అభ్యర్థి రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: దుబ్బాక అంటే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇంతటి చైతన్యవంతులైన ప్రజల తీర్పు ఈ ఎన్నికల్లో ఎలా ఉంటుందని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే, దుబ్బాక బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు.బుధవారం దుబ్బాక పట్టణంలో ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ తనకు ఓటు వేసి గెలిపించాలంటూ విజ్ఞప్తి చేశారు. మీ ఆశీర్వాదంతో మళ్లీ గెలిచి ఈ గడ్డ రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు. దుబ్బాక పట్టణానికి చెందిన పలువురు యువకులు, నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

ఈటలతోనే గజ్వేల్ ప్రజలకు న్యాయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఈటల గజ్వేల్ ప్రజలకు కొండంత అండ అని, నష్టపోయిన ప్రజలను కాపాడే బాధ్యత బీజేపీదేనని పార్టీ మేనిఫెస్టో కమిటీ సభ్యులు కప్పర ప్రసాద్‌రావు, రాష్ట్ర నాయకులు గిరివర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. 3వ తేదీ నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తిగుల్‌నర్సాపూర్ గ్రామంలో కాసేపు గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయ కులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అవ్వా, తాత యాదిపెట్టుకో..



ఓటు వేయాలని ఓటర్లను కోరుతున్న సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): నందారం, కపూర్‌నాయక్‌తండా, పోతారం(జే),ధర్మారం, మసిరెడ్డి తండా, మల్‌చెర్వుతండా, రేగొండ, గోవర్ధనగిరి, రేగొండ, బొడిగెపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రజని పాల్గొన్నారు.



వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న మాణిక్ రావు

ఝరాసంగం(జహీరాబాద్): అనంతసాగర్, చీలమామిడి, చిల్కపల్లి, గినియార్ పల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి, జీర్లపల్లి, ఇస్లాంపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాణిక్ రావు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.



పథకాలను ప్రజలకు వివరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోపాటు ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, సర్పంచ్ కందూరి కనకవ్వ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, కోల సద్గుణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య పాల్గొన్నారు.

గ్యారంటీగా మనమే గెలుస్తాం



గార్లపల్లిలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునిపల్లి(అందోల్): మండలంలోని గార్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, బుదేరా మాజీ ఎంపీటీసీ మనోహర్‌యాదవ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహను గెలిపించాలని, పార్టీ మేనిఫెస్టో ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి మద్దతుగా వెల్దుర్తిలో పార్టీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే, మండలంలోని రామాయిపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రాజిరెడ్డి పర్యటించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, మల్లేశం, నర్సింహారెడ్డి, శంకర్‌గౌడ్, కిష్టాగౌడ్, మైసయ్య పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41758]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యా వరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

WANTED

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-601029]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి MF స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డిటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) VJA, HYD శ్రీమంతులఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600 [B-1206460]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.